క్లుప్తంగా

సీసీ రహదారులకు శంకుస్థాపన



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం అనంత వరప్పాడులో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజ నేయులు శనివారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో రూ. 20 లక్షల 15వ ఆర్థిక సంఘం, పీపీఎఫ్ నిధులతో ఈ రోడ్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలి కాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విజ్ఞాన్ విద్యార్థికి పీహెచ్‌డీ పట్టా ప్రదానం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన విద్యార్థి ముత్తుకూరి నరేంద్ర కుమార్‌కు వర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఆయన 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రొపోర్షనల్ రీసోనంట్ కంట్రోల్డ్ సింగిల్ ఫేజ్ ఫిఫ్టీన్ లెవల్ ప్యాక్డ్ యూ సెల్ మల్టీలెవల్ ఇన్వర్టర్ పీవీ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారని పేర్కొన్నారు. నరేంద్ర కుమార్‌ను చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల లక్ష్యసాధనకు తమ కళాశాల కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అధ్యాపకురాలు కె.స్రవంతికి ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న స్రవంతికి తమిళనాడులోని చిదంబరానికి చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. 'ఏ రియల్ అండ్ యాక్యురేట్ స్పీచ్ నాయిస్ రిడక్షన్ విత్ డీప్ లెర్నింగ్ మోడల్' అనే అంశంపై అదే విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఏ చార్లెస్, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు చెందిన డాక్టర్ టి. రంగబాబుల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించిందని పేర్కొన్నారు. కళాశాలలో పీహెచ్‌డీ కలిగిన 141 మంది బోధనాసిబ్బంది ఉన్నారన్నారు. స్రవంతిని కళాశాల కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె .రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తదితరులు కూడా అభినందించారు.

ఆకట్టుకున్న వీణా కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శనివారం డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాల ఆధ్వర్యంలో వీణా కచేరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పాఠశాల నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కందాల శ్రీనివాస గోవిందరాజన్ వీణపై మా తాపీ గణపతి కీర్తనతో ప్రారంభించగా, పలువురు వాగ్గేయకారుల కీర్తన లను వీణపై పలికించారు. వీణ కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై మార్టూరు హరిబాబు వాయిద్యా సహకారం అందించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆషాఢమాస పౌర్ణమి సందర్భంగా శనివారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యర్థాల కుప్పలు.. వ్యాధుల వెతలు

- పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ప్రధాన ప్రాంతాల్లోనూ కనిపించని పరిశుభ్రత
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాంగం

వానలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో భయాందోళనలకు గురవుతున్నారు. ప్రధాన మార్గాలు, ప్రభుత్వ కార్యాలయాల చెంత చెత్త గుట్టలుగా పేరుకుపోయినా సంబంధిత అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యర్థాలు



పోలీస్ స్టేషను వెనుక దుస్థితి ఇదీ...



గొట్టిపాడులో రోడ్డు పక్కనే చెత్తకుప్ప

ప్రత్తిపాడు: పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాస ప్రాంతాలు ఇప్పటికే వర్షాలకు చిత్తడిగా మారి దోమలు, ఈగలు వంటి రోగకారకాలకు నిలయంగా మారాయి. వీధుల్లో అపరిశుభ్రత, మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనకు ప్రజలు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి చాలాచోట్ల ఉంది.

గుంతలు, పల్లపు ప్రాంతాలలో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. ఫలితంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. డయేరియా, కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం పరిశుభ్రత దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మండలంలో మొత్తం పదహారు గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు మేజర్‌వి. మిగిలినవన్నీ మైనర్ పంచాయతీలే. మేజర్ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు తగినంత మంది ఉన్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఇక గ్రామాల్లో ఎటుచూసినా చెత్తాచెదారాలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే వ్యాధులు విజృంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువల్లో సిల్టు తీసి నిల్వ నీటిలో మడ్డి ఆయిల్ వెయ్యడంతోపాటు ప్రతి గ్రామంలో ఫాగింగ్ చెయ్యాలని చెప్పాం. వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. గ్రామాల్లో రోడ్ల వెంట ఉన్న చెత్తదిబ్బలు తొలగిస్తున్నాం. అన్ని రకాల వివరాలు పీఆర్–1 యాప్‌లో నమోదు చేసి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ ఖాజా, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని కొండేపాడులో ఆదివారం గుంటూరు శ్రీ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటు అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మాత్రలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక



చేబ్రోలు: ఎస్ఎఫ్ఐ చేబ్రోలు మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ శనివారం తెలిపారు. చేబ్రోలు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వి. జగదీష్, ఏ సాయిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎ.అఖిలేష్ , సహ కార్యదర్శిగా జి. అరుణ్ సహా మొత్తం 9 మందితో కమిటీ ఏర్పడింది. ముఖ్య అతిథిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యారంగంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యం పెరగాలని పేర్కొన్నారు. చదువుకుంటూ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై. యశ్వంత్ , కే అఖి, కే పుష్పహాస్, ఏ తిరుమలేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న డీఏవో నున్న వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారంతోపాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడొచ్చని డీఏవో నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ, లాం గ్రామాల్లో రైతులు అలవాల కోటేశ్వరరావు, మట్టి నాగేశ్వరరావులు పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటేశ్వరరావు మూడు ఎకరాలలో మిరప పంట కోసం పీఎండీఎస్ (నవ ధాన్య పద్ధతి)లో 30 రకాల విత్తనాలతో పచ్చి రొట్ట పంటను ముందుగా విత్తారని చెప్పారు. ఈ విధానం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి మొక్కలకు తెగులు, పురుగుల ఉద్ధృతి తగ్గుతుందన్నారు. రైతులు అందరూ ఈ పద్ధతి పాటించాలని కోరారు. పత్తి పంటలో కంది 6:1 నిష్పత్తిలో విత్తుకున్నట్లు చెప్పారు. అంతర పంటలుగా అలసందలు, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు వేశారని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ప్రధాన పంటతోపాటుగా అదనపు ఆదాయాన్ని పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కలుపు నియంత్రణ సాధ్యపడుతుందని రైతులందరూ గమనించాలని చెప్పారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటను విత్తుకున్న రైతులు 15, 30, 45, 60 రోజులకు ఒకసారి నీమాస్త్రంను పంటపై పిచికారీ చేయాలన్నారు. తద్వారా రసం పీల్చే పురుగుల నుంచి పంటను రక్షించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఏవో ఐ. సుబ్రమణ్యం, యూనిట్ ఇన్‌చార్జి నాగరాజా, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' కింద గ్రామాభివృద్ధి పనులు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

చేబ్రోలు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను పూర్తి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.ఉమాదేవి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పథకం కింద 2023–24లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది సుమారు రూ.7 కోట్ల వ్యయంతో పంట కాలువల అభివృద్ధి, నిమ్మతోటల పెంపకం, రోడ్లకు ఇరువైపుల మొక్కల పెంపకం తదితర పనులను పూర్తి చేశారు. కొద్ది రోజుల క్రితం సోషల్ ఆడిట్ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ప్రజావేదికలో వివరించారు. మండల పరిధిలోని వీరనాయకునిపాలెం గ్రామంలో చేపట్టిన పనులపై ప్రజావేదికలో స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు. జాబ్ కార్డుదారుల నుంచి డబ్బులు వసూలు చేయటం, పనులలో అవకతవకలు జరిగినట్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. సుద్దపల్లి, శలపాడు, శ్రీరంగపురం గ్రామాలకు చెందిన ఫీల్డు అసిస్టెంట్ల పనితీరుపై టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పథకం అధికారులు ఏపీడీ బాలమ్మ, డీవీవో విజయలక్ష్మి, ఎస్ఆర్‌పీ రామచంద్రరావు, ఎంపీడీవో కె. జ్యోతి, ఏపీవో ఆనంద్ మోహన్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేటెంట్ ప్రాముఖ్యతపై శిక్షణ



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పేటెంట్ అనేది ఓ వ్యక్తికి చెందిన ఉత్పత్తి, మేధస్సుకు చట్టపరమైన హక్కును కల్పిస్తుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్ విభాగం, ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియన్ పేటెంట్ ఫైలింగ్ హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ అనే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పేటెంట్‌కు వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శాస్త్రవేత్తలు తాము ఆవిష్కరించిన వాటికి, పరిశోధనలు కాపాడుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌యూ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం, కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి. అనిత, ఐపీఆర్ అటార్నీ ఎం. సుధీర్, ఇక్సోరాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాననీదాస్ తదితరులు పేటెంట్ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 8 కళాశాలల నుంచి 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కో ఆర్డినేటర్ వై. కౌషిక్, డాక్టర్ పీవీ సురేష్, ఎం. శివప్రసాద్‌లను కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు. అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

రైతులకు రాయితీ విత్తనాలు అందేలా కృషి



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించేలా కృషి చేస్తానని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. త్వరలో పూడిక తీసి రైతులు నష్టపోకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధి పనులు ప్రారంభించాలి

పెదకాకాని: పంట కాలవల అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెలపాడు వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాల్లో నీరు చేరిన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి అనుకూలంగా తూటికాడ, గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. అధికారులతో మాట్లాడుతూ గుంటూరు ఛానల్లో ఈ పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. హై లెవెల్ కాలువలో తూటికాడ తొలగించాలని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. నరకమే చెంత

- కనీస మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- వర్షపు నీటి నిల్వతో పరిస్థితి దారుణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గుంతలతో అధ్వానంగా చందోలు రోడ్డు

పొన్నూరు : పొన్నూరు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రహదారులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. లోతైన గుంతలు ఉన్న రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు ప్రమాదాల బారిన పడి పలువురు గాయాల పాలవుతున్నారు. ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి గాయాల పాలవకుండా తిరిగి వస్తారన్న నమ్మకం సన్నగిల్లుతోంది. అడుగడుగునా గుంతల్లో వర్షం కురిసినప్పుడు నీరు చేరి పరిస్థితి మరీ ప్రమాదకరంగా మారింది. ఎక్కడ రోడ్డుందో, ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. ఆటోలు, చిన్నకార్లు గుంతల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రం పొన్నూరు నుంచి చందోలు వెళ్లే ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాలకు అనుసంధానంగా ఉండే రోడ్లు దారుణ దుస్థితికి చేరాయి. తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఈ మార్గంలో ప్రధాన గ్రామాలు ఎక్కువగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు, లోడు లారీలు, ఆటోలు వంటివి ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పెద్ద గుంతలు పడి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిడుబ్రోలు నుంచి చందోలు వెళ్లే రోడ్డులో అత్యవసరంగా మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నుంచి కాపాడాలని వాహనచోదకులు కోరుతున్నారు.





గుంతలలో వర్షపు నీరు చేరడంతో ప్రమాదకరంగా మారిన రోడ్లు

వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విలేకరిని వృత్తిపరంగా విమర్శిస్తూ వార్త పెట్టిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

వివరాలు.. విలేకరి అరుణ్‌పై ఓ వ్యక్తి వృత్తిపరంగా విమర్శిస్తూ జర్నలిస్టు డైరీలో వార్త ప్రచురితమైనట్లు పోస్టు పెట్టాడు. అరుణ్ జర్నలిస్టు డైరీ పత్రిక నిర్వాహకులను సంప్రదించాడు. పత్రిక నిర్వాహకులు తమ పత్రికలో అటువంటి కథనం ఏదీ ప్రచురితం కాలేదని సమాధానం ఇచ్చారు.

దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



పద్మావతి

ప్రత్తిపాడు: భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చిన వివాహిత అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన గుంజా పద్మావతి (20)కి రెండు సంవత్సరాల క్రితం బాపట్ల జిల్లా కర్లపాలెంకు చెందిన మంగయ్యతో వివాహమైంది. భర్తతో గొడవ పడి ఇటీవల ప్రత్తిపాడులోని పుట్టింటికి వచ్చింది. తర్వాత కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి తన్నీరు భూలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం చేసినట్లు ఆరోపణ.. కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ సబ్సిడీతో కారు ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కేవీపీ కాలనీకి చెందిన దారపనేని శ్రీహరికి అరుంధతీనగర్‌కు చెందిన కొండవీటి రవీంద్రబాబు, కోయరపాలేనికి చెందిన నాగరాజులతో పరిచయం ఉంది. ఇద్దరు ప్రభుత్వ పథకం కింద 45 శాతం సబ్సిడీతో కారు ఇప్పిస్తామని శ్రీహరిని నమ్మబలికారు. శ్రీహరి అందుకు ఇరువురికి రూ.1.50 లక్షలు చెల్లించాడు. అనంతరం వారు కారు ఇప్పించలేదు. శ్రీహరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కోర్టు ఆదేశాలు లేకుండా బ్యాంకు సిబ్బంది న్యాయవాదులను వెంట బెట్టుకుని వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తారకరామానగర్‌లోని హైమావతి నివాసాన్ని విజయకుమార్ కొనుగోలు చేశాడు. అయితే హైమావతి డబ్బులు తీసుకుని రిజిస్ట్రార్ చేయలేదు. విజయకుమార్ రిజిస్ట్రారు చేయాలంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది, న్యాయవాదులను వెంట తీసుకుని ఇంటి గేటు తాళాలు పగులగొట్టి లోపలకు వప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న విజయకుమార్ వారిని ప్రశ్నించగా, ఇల్లు బ్యాంకు తాకట్టులో ఉందని వారు తెలిపారు. అయితే వారి వద్ద కోర్టు ఆర్డర్లు లేవు. విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.